
సాక్షి కామారెడ్డి

సోమవారం । 27 । మార్చి । 2023




ఆదాయమున్నా..
ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని కాలభైరవ ఆలయానికి భారీగా ఆదాయం వస్తున్నా.. అభివృద్ధి అంతంతగానే జరుగుతోంది.
- 8లో ▸



అవినీతికి చెక్
ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.8 /20.8

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

'నిజాయితీతో వ్యాపారం చేయాలి'



కామారెడ్డి అర్బన్ : రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిజాయితీతో వ్యాపారం చేయడం ద్వారా వ్యక్తిగతంగా మంచి పేరు సంపాదించవచ్చని, ప్రభుత్వానికి ఆదాయమూ సమకూరుతుందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో కామారెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ (క్రెడా) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గంప గోవర్ధన్ మాట్లాడుతూ కామారెడ్డిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్ల సేవలు ప్రశంసనీయమన్నారు. త్వరలోనే క్రెడా పక్కా భవనానికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుంబాల రవి యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావు, మామిండ్ల అంజయ్య, జి.చంద్రశేఖర్‌రెడ్డి, క్రెడా ప్రతినిధులు పిట్ల రాములు, కే.సత్యం, కే.భీంరాజు, దేవసేన పటేల్, మాజీ అధ్యక్షుడు బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ పీఎస్ తనిఖీ



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతేడాదికన్నా నేరాలు, ప్రమాదాలు తగ్గాయన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్నందున ఎప్పటికప్పుడు తనఖీలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సై కోనారెడ్డి, ఏఎస్సై రాములు, సిబ్బంది రాజు, వెంకట్, రమేష్, అంజి, రవి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోబీ కోసం సర్వే



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆదివారం సర్వే చేశారు. రైల్వే పట్టాలకు ఇరువైపులా రోడ్లు, భవనాలను పరిశీలించారు. భవనాల యజమానులతో మాట్లాడారు. సర్వే వివరాలను రైల్వే శాఖను నివేదించనున్నారు. పట్టణంలో ప్రస్తుతం రైల్వే బ్రిడ్జి ఒక్కటే ఉండడం, అది కూడా ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. అశోక్‌నగర్ కాలనీలో మరో రైల్వే ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. త్వరగా రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కవులకు జల కవి రత్న అవార్డులు



కామారెడ్డి అర్బన్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర జల సంరక్షణ సమితి, హైదరాబాద్ నగర జలమండలిల ఆధ్వర్యంలో హైదరాబాద్ క్లబ్ హౌజ్‌లో జల పరిరక్షణ కవితోత్సవం నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన కవులు పాల్గొన్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన వైద్య శేషారావు, చాకి రాజేందర్ జల కవిరత్న అవార్డులు పొందారు. వీరిని పలువురు కవులు అభినందించారు.

మళ్లీ లొల్లి..!

- కామారెడ్డి నియోజకవర్గంలో వేడెక్కిన రాజకీయం
- జోడో యాత్రలో ఎమ్మెల్యేపై కాంగ్రెస్ చార్జిషీట్
- పనుల్లో వాటాలు.. డబ్బులిస్తే పోస్టింగులని ఆరోపణలు
- షబ్బీర్ అలీపై విరుచుకుపడ్డ గంప గోవర్ధన్
- మంత్రిగా పనిచేసి అడ్డగోలుగా దోచుకున్నారంటూ ధ్వజం
- కొనసాగుతున్న సవాళ్ల పర్వం

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కామారెడ్డి నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ ప్రత్యర్థుల మధ్య మళ్లీ లొల్లి మొదలైంది. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు రాజకీయ వేడి పెంచాయి. దీనిపై ప్రభుత్వ విప్ సైతం ఘాటుగా స్పందించారు. ఇరు పార్టీల నేతలు విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రెచ్చిపోతుండడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.



సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి నియోజకవర్గంలో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, ప్రస్తుత ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ల మధ్య దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయ వైరం కొనసాగుతోంది. 1989 లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన షబ్బీర్ అలీ మంత్రిగా పనిచేశారు. తర్వాత 1994, 99 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004 ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి వైఎస్సార్ మంత్రివర్గంలో కీలక భూమిక పోషించారు. అనంతరం 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. మరోవైపు గంప గవర్దన్ తొలిసారిగా 1994 లో ఎమ్మెల్యే అయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించారు. మధ్యలో ఒక ఉప ఎన్నికలోనూ గెలుపొందారు. వరుస విజయాలు సాధిస్తున్న గంప గోవర్ధన్ నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించారు. అయితే ఓటములు ఎదురైనా షబ్బీర్ అలీ ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటున్నారు. ఎప్పుడూ ఏదో ఒక కార్యక్రమంతో షబ్బీర్ అలీ స్థానికంగా ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు నేతలు తరచూ ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగుతుంటారు. గంప గోవర్ధన్‌పై షబ్బీర్ అలీ విమర్శలు, ఆరోపణలు చేయడం, గంప గోవర్ధన్ ఎదురుదాడికి దిగడం పరిపాటిగా మారింది.

రేవంత్‌రెడ్డి పర్యటనతో మరోమారు..

కామారెడ్డి నియోజకవర్గంలో ఇద్దరు ప్రత్యర్థుల మధ్య మాటల యుద్ధం చినికిచినికి గాలివానగా మారుతూ ఉంటుంది. గతంలోనూ ఇద్దరు నేతలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకున్నారు. 2018 ఎన్నికలకు ముందు షబ్బీర్ అలీ, గంప గోవర్ధన్‌ల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆస్తులు, అంతస్తులు, అక్రమాల గురించిన విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. జిల్లాకేంద్రంలోని గంజ్‌లోగల గాంధీ విగ్రహం సాక్షిగా బహిరంగ చర్చకు సిద్ధపడ్డారు. ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ తర్వాత వివాదం సద్దుమణిగింది. ఇప్పుడు మరోమారు ఆస్తులు, అక్రమాల పంచాయతీ తెరపైకి వచ్చింది.

ఇటీవల పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఇరువురు నేతల మధ్య మరోసారి వివాదాన్ని రాజేసింది. జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై చార్జిషీట్‌లు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.. కామారెడ్డి ఎమ్మెల్యేపై తొమ్మిది ఆరోపణలతో చార్జిషీట్ విడుదల చేశారు. ఓ వెంచర్‌కు మున్సిపల్ నిధుల నుంచి రోడ్లు వేయించుకున్నాడని, అన్ని పనుల్లో వాటాలు తీసుకుంటున్నారని, పోస్టింగులకు డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ విప్‌కు ఆగ్రహాన్ని తెప్పించింది. మూడు రోజుల క్రితం కామారెడ్డి పట్టణ సమీపంలోని ఓ ఫాం హౌజ్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో షబ్బీర్ అలీపై ఎదురుదాడికి దిగారు. షబ్బీర్ అలీ రెండుసార్లు మంత్రిగా పనిచేసిన సమయంలో అడ్డగోలుగా దోచుకున్నాడని, సొంత ఊరిని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. వరుసగా ఓడుతున్నా బుద్ధిరాలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్తులను ప్రజలకు పంచడానికి సిద్ధమా అని సవాల్ చేశారు. శనివారం డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో గంప గోవర్ధన్ ఆరోపణలను తిప్పికొట్టారు. వైద్య శాఖలో ఏఎన్‌ఎంల పోస్టులు అమ్ముకోవడం, అక్రమ రోడ్డు తదితర అంశాలను ప్రస్తావించారు. బీఆర్‌ఎస్ నేతలు సబ్ రిజిస్ట్రార్‌ను బ్లాక్ మెయిల్ చేసింది నిజం కాదా అని గంప గోవర్ధన్‌ను ప్రశ్నించారు. ఇలా ఇరువురు ప్రత్యర్థులు ఆరోపణలు, ప్రత్యారోపణలకు దిగుతుండడంతో 2018 ఎన్నికలకు ముందున్న పరిస్థితులే ప్రస్తుతం కనిపిస్తున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

- కార్యకర్తలకు ఎమ్మెల్యే హన్మంత్ సింధే పిలుపు
- వాజీద్‌నగర్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

బిచ్కుంద: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే కోరారు. ఆదివారం వాజీద్‌నగర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. గ్రామాలకు నిధులిచ్చి అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నామన్నారు. బీఆర్‌ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు తట్టుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వాటికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి రాష్ట్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేంద్రంలోనూ బీఆర్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

సంఘం భవనానికి నిధులు....
వాజీద్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. త్వరలోనే పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, జెడ్పీటీసీ నాల్చర్ భారతి, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ సాయిలు, సీనియర్ నాయకులు అసద్‌అలీ, రాజు, వెంకట్‌రావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

'విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తా'

బాన్సువాడ రూరల్: బాన్సువాడలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. దళిత సంఘాల ప్రతినిధులు ఆదివారం బాన్సువాడలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. బాబూ జగ్జీవన్ రాం విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కోరారు. వచ్చేనెల 5న బాన్సువాడలో నిర్వహించే జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డివిజన్ కమిటీ ఎన్నిక
పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం బాబూ జగ్జీవన్‌రాం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాదేపురం గంగారాం, గౌరవ అధ్యక్షుడిగా పోశీరాం, ప్రధాన కార్యదర్శిగా మారుతి, సభ్యులుగా గంగాధర్, హన్మాండ్లు, అశోక్, రమేష్, సాయిబాబా, మోహన్ ఎన్నికయ్యారు.



స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నేతలు

దోమకొండ సీహెచ్‌సీ స్థాయి పెంపునకు కసరత్తు

- 30 నుంచి 100 పడకలకు..
- నివేదికలు కోరిన వైద్య విధాన పరిషత్

కామారెడ్డి టౌన్: దోమకొండ సీహెచ్‌సీ స్థాయి పెంచడానికి కసరత్తు జరుగుతోంది. ఈ ఆస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకలకు పెంచడానికి నివేదికలు పంపాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ డిప్యూటీ కమిషనర్ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. దోమకొండ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రభుత్వానికి లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో వైద్య విధాన పరిషత్ చర్యలు చేపట్టింది. దోమకొండ సీహెచ్‌సీ స్థాయి పెంచడానికి కావాల్సిన ఎంసీహెచ్, జనరల్ మెడిసిన్, డెంటల్, సర్జరీస్, ఈఎన్‌టీ, కంటి, రేడియాలజీ, పాథాలజీ, బెడ్లు, ఓపీ, ఐపీ, ఆస్పత్రి పరిధిలో జనాభా, చుట్టుపక్కల ప్రభుత్వ ఆస్పత్రులు, భవనం తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కోరింది. దీంతో జిల్లా వైద్యాధికారులు నివేదికలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నివేదిక ఆధారంగా దోమకొండ సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

సొంత గూటికి డీఎస్

ఖలీల్‌వాడి: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్(డీఎస్), తన తనయుడు నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌తో కలిసి ఆదివారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. డీఎస్ మళ్లీ సొంత గూటికి చేరడం కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిల సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. డీఎస్ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటారనే ప్రచారం జరిగింది. ఇటీవల అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కూడా పొందారు. ఆదివారం గాంధీభవన్‌కు వీల్‌చైర్‌లో డీఎస్ రావడం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరడం తాజాగా చర్చకు దారితీసింది. గాంధీభవన్‌కు వచ్చిందే కాంగ్రెస్‌లో చేరడానికి అని డీఎస్ చెప్పడం కొసమెరుపు.



డీఎస్‌తో కాంగ్రెస్ సీనియర్ నేతలు

బహిరంగ లేఖ..
ధర్మపురి శ్రీనివాస్ తన ఇద్దరు కొడుకులనుద్దేశించి బహిరంగ లేఖ విడుదల చేశారు. బీజేపీ ఎంపీగా ఉండి ప్రజలకు సేవ చేస్తున్న అర్వింద్‌ను అభినందించారు. పెద్ద కొడుకు సంజయ్ కాంగ్రెస్‌లోకి వెళ్తున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలు వేరైనా వాళ్లిద్దరూ తెలంగాణ ప్రజల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేసి మంచి పేరు తెచ్చుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. నా ఆరోగ్యం సహకరిస్తే గాంధీభవన్‌కు వెళ్లి సంజయ్‌ను ఆశీర్వదిస్తానని, కాంగ్రెస్‌లో చేరే వార్తలు అవాస్తవమని లేఖలో పేర్కొన్నారు. అనంతరం తనయుడు సంజయ్‌తో గాంధీభవన్‌కు వచ్చిన డీఎస్ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

జిల్లాలో 'ఆత్మీయ' సందడి!

- మండలాలవారీగా బీఆర్‌ఎస్ సమ్మేళనాలు
- కార్యకర్తలతో కలిసి భోజనాలు చేస్తున్న ఎమ్మెల్యేలు



రామారెడ్డిలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు (ఇన్‌సెట్‌లో..) మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల ఏడాది కావడంతో ఎమ్మెల్యేలు క్షేత్ర స్థాయిలోనే ఉండాలని, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ నాయకత్వం ఆదేశించింది. కార్యకర్తల మనోభావాలు తెలుసుకుని వారు చెప్పినవి విని అమలు చేయాలని పేర్కొంది. దీంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మండలాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో తొలి సమ్మేళనం ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం తాండూరులో జరిగింది. దీనికి ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమ్మేళనానికి భారీ జనసమీకరణ చేయడంతో పాటు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. తర్వాత కామారెడ్డి నియోజకవర్గంలో వరుసగా సమ్మేళనాలు జరిగాయి. ఇప్పటికే బీబీపేట, దోమకొండ, రాజంపేట, భిక్కనూరు, రామారెడ్డి, మాచారెడ్డి, కామారెడ్డి మండలాల సమ్మేళనాలు నిర్వహించారు. శనివారం కామారెడ్డి పట్టణ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. నియోజకవర్గంలో దాదాపు అన్ని మండలాల సమావేశాలు పూర్తయ్యాయి. ఆయా సమ్మేళనాల్లో ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు. అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని, ప్రజలకు వాస్తవాలు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

జుక్కల్ నియోజకవర్గంలోని పెద్దకొడప్‌గల్, బిచ్కుందలలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఆయా సమ్మేళనాల్లో పాల్గొని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోనూ ఆత్మీయ సమ్మేళనాలు జోరుగా సాగుతున్నాయి. ఎమ్మెల్యేలు, నాయకులు కార్యకర్తలతో మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారితో కలిసి భోజనాలు చేస్తున్నారు. ఎన్నికలకు ఇప్పటినుంచే కేడర్‌ను సమాయత్తం చేసేలా పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు.

కార్యకర్తల్లో జోష్..
అభివృద్ధి పనులకు సంబంధించి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో గ్రామాలకు ఎమ్మెల్యేలు వెళ్తున్నప్పటికీ కార్యకర్తలకు సమయం ఇచ్చే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో ఆత్మీయ సమ్మేళనాల వల్ల రోజంతా కార్యకర్తలకు సమయం వెచ్చించే అవకాశం దొరికింది. దీంతో కార్యకర్తలు తమ సమస్యలు, తమ పరిధిలోని గ్రామాలు/వార్డుల్లోని సమస్యలను చెప్పుకుంటున్నారు. ఎమ్మెల్యేలు వారి సమస్యలు వింటూ పరిష్కరిస్తామన్న భరోసా ఇస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కార్యకర్తలు మరింత పట్టుదలతో పనిచేయాలని ఎమ్మెల్యేలు వారికి వివరిస్తున్నారు. దీంతో ఆత్మీయ సమ్మేళనాలతో కార్యకర్తల్లో జోష్ కనిపిస్తోంది.





కామారెడ్డిలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్(ఫైల్), పెద్దకొడప్‌గల్ సమ్మేళనంలో హన్మంత్ సింధే(ఫైల్)



వరి కోతలు షురూ

మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. వడగళ్ల వాన, ప్రకృతి వైపరీత్యాల నుంచి తప్పించుకోవడానికి మండలంలోని పలు ప్రాంతాలలో ముందస్తుగా వరి నాట్లు వేశారు. పంట చేతికి రావడంతో కోతలు మొదలుపెట్టారు. మిగతా ప్రాంతాలకన్నా ముందుగానే నాట్లు వేశామని, దీంతో నెల ముందుగానే కోతలు మొదలుపెట్టామని లింగంపల్లి ప్రాంతానికి చెందిన రైతులు పేర్కొంటున్నారు.

– నస్రుల్లాబాద్

'టీచర్ల సమస్యలు పరిష్కరించాలి'

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చీరాం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ–కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులు, వేతనాలను ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలను పునః ప్రారంభించాలన్నారు. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రతి నెల వేతనాలను చెల్లించాలని కోరారు. పండిత్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మొగులయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర శ్రీనివాస్, నాయకులు బాబు, సుజాత, పోచయ్య, ప్రవీణ్‌కు



మాట్లాడుతున్న లచ్చీరాం

క్లుప్తంగా

'వర్సిటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జి, పీడీపై చర్యలు తీసుకోవాలి'



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్, గేమ్స్ ఇన్‌చార్జి సంపత్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేతపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారం తెయూ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్సిటీలో స్పోర్ట్స్ బోర్డు ఏర్పాటైన తర్వాత ఇంతవరకు ఒక్క సమావేశం నిర్వహించలేదన్నారు. క్రీడలకు సంబంధించిన పరికరాలు లేవని, సరైన మైదానం లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. వర్సిటీ జట్ల తరఫున ఎంపికై సౌత్ జోన్, ఆల్ ఇండియా నేషనల్ యూనివర్సిటీస్ టోర్నమెంట్లకు వెళ్లే వారికి ట్రాక్, డ్రెస్ కిట్, ట్రావెలింగ్ అలవెన్సులు కొన్ని క్రీడాలకు మాత్రమే ఇచ్చి, మరికొన్ని క్రీడలకు ఇవ్వడం లేదని ఆరోపించారు. అకౌంట్ సెక్షన్ నుంచి స్పోర్ట్ విభాగం అకౌంట్‌లో డబ్బులు వేసిన తర్వాత కూడా క్రీడాకారులకు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు మోహన్, నరేష్, అక్షయ్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సాయిశ్రీకి సన్మానం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన సాయిశ్రీ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో ఆమెను పలువురు ఆదివారం సన్మానించారు. పట్టణంలోని పద్మశాలి సంఘంలో పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గం నాయకులు, పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు సన్మానించారు. పద్మశాలి సంఘం నాయకులు లక్ష్మీ నర్సయ్య, జంగం గంగాధర్, పద్మ పండరి, పద్మ దశరథం, పోశెట్టి ఉన్నారు.

పరీక్షలకు సన్నద్ధమవ్వాలి



సిరికొండ: ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు బాగా సన్నద్ధమవ్వాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర పరిశీలకులు పద్మశ్రీ తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆమె ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికలను, పుస్తకాల పంపిణీ, అడ్మిషన్, మార్కుల రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ తుల రవీందర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ మోతీలాల్, ట్యూటర్ గంగారం, జమున, లావణ్య పాల్గొన్నారు.

ఆదాయమున్నా.. అభివృద్ధి శూన్యం

- కాలభైరవుడి ఆలయంలో వసతులు కరువు
- వచ్చిన ఆదాయంలో 40శాతం దేవాదాయ శాఖకే..
- దాతల విరాళాలతోనే వసతుల కల్పన



ఆలయంలోని కోనేరు



కాలభైరవుడి ఆలయం

రామారెడ్డి: నిత్యం భక్తుల రద్దీ ఉండే ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఆలయానికి ఆదాయం వస్తున్నా.. వసతులు కల్పించడం లేదు. పురాతన చరిత్ర గల ఈ ఆలయాన్ని ఎంతో మంది భక్తులు దర్శించుకుంటారు. 1974లో దేవాదాయశాఖ ఈ గుడిని తమ ఆధీనంలోకి తీసుకుంది. భక్తులు ఇచ్చిన రూ.50 లక్షల విరాళాలతో 2001లో ఆలయం నిర్మించి, రేకుల షెడ్డులో ఉన్న స్వామి విగ్రహాన్ని అందులోకి మార్చారు. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు 2009లో రూ.ఐదు లక్షలు మాత్రమే మంజూరు చేసింది. ఆ నిధులతో శనేశ్వరాలయం నిర్మించారు. ఎంపీ బీబీ పాటిల్ ఆలయం ప్రాగణంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. ఈ నిధులు తప్పా ఇప్పటి వరకు కాలభైరవుడి ఆలయానికి ఏ ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయలేదు. దాతలు, భక్తుల సహాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. నాలుగు వైపులా గోపురాలను నిర్మించారు. ఒక్కో గోపురానికి రూ.50లక్షలకుపైగా ఖర్చు అయితే దాతలే సహకరించారు.

అనేక సమస్యలు

ఆలయంలో మూల బావి, కోనేరు దగ్గర స్నానపు గదుల నిర్మాణం చేపట్టాలి. మహిళలు దుస్తులు మార్చుకోడానికి తాత్కాలికంగా రేకులతో షెడ్లు వేశారు. శాశ్వత గదులు నిర్మించాల్సి ఉంది. భక్తులకు మరుగుదొడ్లు లేవు. ఆలయంలో గార్డెన్, ఉద్యానవనం, ధాన్య మందిరం నిర్మించాల్సి ఉంది. మూల బావి దగ్గర లైటింగ్ సిస్టం, ప్రధాన ఆలయం, గోపురాల మధ్య కులింగ్ రేకుల నిర్మాణం చేయాలి. మరో పక్క ప్రధాన గోపురం ఎదుట రోడ్డు వెడల్పు చేయాల్సి ఉంది. రోడ్డు వెడల్పు చేయాలంటే అక్కడ ఉన్న ఇళ్లను తొలగించాలి. ఆ కుటుంబాలకు పరిహారం కోసం పెద్ద మొత్తంలో నిధులు కావాలి.



దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లు

కల్యాణ మండపం నిర్మించాలి

కాలభైరవుడి ఆలయం ప్రాగణంలో అనేక వివాహాలు జరుగుతాయి. కానీ వివాహాలు చేసుకోడానికి వీలుగా వసతులు లేవు. వివాహాలు చేసుకునే వారే ప్రాంగణంలో తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేసుకుంటారు. వర్షాకాలంలో వివాహాలకు ఇబ్బందిగా ఉంటుంది. ప్రభుత్వం అన్ని వసతులతో కల్యాణ మండపం ఏర్పాటు చేయాలి.

'ముఖ్యమంత్రిని తీసుకొస్తా'

కాలభైరవుడి ఆలయానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తీసుకోస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదివారం రామారెడ్డిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకటించారు. ముఖ్యమంత్రి ఆలయానికి వస్తే నిధులు కేటాయించే అవకాశం ఉందని, సీఎంను తీసుకు రావాలని ఇసన్నపల్లి సర్పంచ్ బాలమణి, రామారెడ్డి సర్పంచ్ సంజీవ్ ఎమ్మెల్యే సురేందర్‌ను కోరారు.

ఏటా ఉత్సవాలు

ప్రతి ఏటా కార్తీక బహుళ అష్టమి సందర్భంగా కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుతారు. ఉత్సవాలకు భారీగా భక్తులు హాజరు అవుతారు. ఏటా ఆలయానికి భక్తులు భారీగా వస్తుండటంతో ఆదాయం కూడా బాగానే వస్తుంది. ఆలయానికి వచ్చే ఆదాయంలో నుంచి సెస్ రూపంలో 20శాతం దేవాదాయ శాఖకు చెల్లిస్తారు. తాజాగా ఉద్యోగుల వేతనాల కోసం మరో 20 శాతం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చిన ఆదాయంలో 40శాతం అటే పోతే గుడి అభివృద్ధి, నిర్వహణకు నిధులు ఎలా అని గ్రామస్తులు అంటున్నారు. 2022–23 సంవత్సరంలో ఆలయానికి భక్తుల ద్వారా రూ.49 లక్షల ఆదాయం వచ్చింది. ఇందులో 19.6 లక్షలను దేవాదాయ శాఖకు చెల్లించారు.

దేశ పరమ వైభవమే లక్ష్యం



మాట్లాడుతున్న కాచం రమేశ్

సుభాష్‌నగర్: భారతదేశ పరమ వైభవమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని శివాజీనగర్‌లోగల ఐటీఐ కళాశాల మైదానంలో ఆర్‌ఎస్‌ఎస్ ఇందూరు నగర శారీరకోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా సంఘ్ చాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం అధ్యక్షత వహించారు. కాచం రమేశ్ మాట్లాడుతూ సంఘం వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ సౌభాగ్యాన్ని కాంక్షిస్తుందన్నారు. ఇందుకోసం వ్యక్తి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచడానికి ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు నిర్వహిస్తుందని తెలిపారు. దేశ హితమే తనకు ప్రధానమనే వ్యక్తులను సంఘ్ తయారు చేస్తుందని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల వల్లే నేడు భారతదేశ విలువ ప్రపంచంలో పెరిగిందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ తూకుంట్ల విశ్వతేజ మాట్లాడారు. 1925లో ఆరుగురితో ప్రారంభించిన ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు లక్షలాది మంది చేరికతో వైభవోపేతంగా మారిందన్నారు. అంతకుముందు ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు ఘోష్, నియుద్ధ, దండవ్యాయామం, ఆసనాలు, యోగ, ఆటలు, తదితర ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో జాగృతి సహ సంపాదకులు దుర్గారెడ్డి, ప్రతాప్, గణేష్, 500 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు.



కర్రసాము చేస్తున్న స్వయం సేవకులు

కళలను కాపాడుకుందాం



నిజామాబాద్ సిటీ: జానపద కళాకారులను, కళను పరిరక్షించుకుని భావితరాలకు అందించాల్సిన అవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని కవి వీపీ చందన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక గీత భవనంలో తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ఉగాది పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. పురోహిత, జానపద, సంఘసేవ తదితర అంశాల్లో ప్రతిభ కనబర్చిన 18 మంది కళాకారులకు ఉగాది పురస్కారాలను అందించారు. చంద్రశేఖరరావు, రాజ్ కుమార్ సుబేదర్, కాసర్ల నరేష్ రావు, జనగామ చంద్రశేఖర శర్మ, డాక్టర్ గణపతి అశోకశర్మ, సముద్రాల మాధురి మధుసూదనచారి పాల్గొన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



బాన్సువాడ రూరల్: మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఉత్కంఠగా సాగాయి. విజేతలకు బహుమతితో పాటు వెండి కడియాలు బహూకరించినట్లు సర్పంచ్ లక్ష్మీ శంకర్‌గౌడ్ తెలిపారు.

క్యూబిక్ మీటర్ ధర పెంచమంటే..



మోర్తాడ్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- కూలి పెంపుతో సరిపెట్టారు
- ఉపాధి కూలీలకు రూ.15 పెంచుతూ కేంద్రం నిర్ణయం
- మట్టిని తవ్వడంలో క్యూబిక్ మీటర్ ధర పెంచితేనే కూలీలకు ప్రయోజనం

మోర్తాడ్: ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కూలి రూ.15 పెంచుతూ కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. కూలీలకు కూలి పెంచడంకంటే మట్టి పనులకు సంబంధించి క్యూబిక్ మీటర్ ధర పెంచితేనే ప్రయోజనం అని నిపుణులు చెబుతున్నారు. క్యూబిక్ మీటర్ ధర తగ్గించి కూలి ధర హెచ్చింపు చేసినా కూలీలకు చేతికి అందేది అంతంత మాత్రమే అని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూలి రూ.257గా ఉంది. దీనిని రూ.272కు పెంచారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పెరిగిన కూలి ధర ఏప్రిల్ నుంచి అమలులోకి రానుంది. ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పనికి తగిన వేతనం చేతికి అందాలంటే రూరల్ స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్(రూరల్ ఎస్ఎస్ఆర్) ప్రకారం ఒక్కో పనికి ఒక విధమైన ధర నిర్ణయించాల్సి ఉంటుంది. కూలీ రేటును ప్రతి ఏటా పెంచుతూనే ఉన్నా కూలీలకు మాత్రం రోజుకు రూ.135 నుంచి రూ.150కి మించి చేతికి అందడం లేదు. చెరువుల్లో పూడికి తీయడం, కట్టల ఎత్తు పెంచడం, భూములను చదను చేయడం ఇతరత్రా మట్టి పనులే ఎక్కువగా చూపుతున్నారు. అందువల్ల క్యూబిక్ మీటర్ ధరలను పెంచితే కూలీలకు న్యాయం జరుగుతుందనే వాదన వినిపిస్తుంది. జిల్లాలో 5.55 లక్షల మంది కూలీలు ఉండగా ఇందులో 2.50లక్షల మంది కూలీలు రెగ్యులర్‌గా పనులకు హాజరవుతున్నారు.

జిల్లాకు రూ.80 కోట్ల వడ్డీ రాయితీ



మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: జిల్లాలోని మహిళా సంఘాలకు రూ.80 కోట్ల వడ్డీ రాయితీ మంజూరైనట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. భీమ్‌గల్‌లో మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఒక్కో మహిళా సంఘానికి రూ.పది వేల నుంచి రూ.20 వేల వేల రుణాలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం ఒక్కో సంఘానికి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు వడ్డీ రాయితీ మంజూరు చేయడం రాష్ట్ర ప్రభుత్వ పని తీరుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా రూ.80 కోట్ల వడ్డీ రాయితీ నిజామాబాద్ జిల్లాకు మంజూరు కాగా, జిల్లాలో రూ.20 కోట్ల వడ్డీ రాయితీ బాల్కొండ నియోజక వర్గం మహిళా సంఘాలకు మంజూరు కావడం హర్షనీయమన్నారు. బాల్కొండ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన మహిళా రైతు ఉత్పత్తిదారుల సమఖ్య ఆధ్వర్యంలో వేల్పూర్‌లోని పసుపు పరిశోధన క్షేత్రంలో ఏర్పాటు చేసే పసుపు శుద్ధి యూనిట్‌కు రూ.51 లక్షల గ్రాంట్ మంజూరు చేయిస్తానని మంత్రి వెల్లడించారు. అనంతరం స్త్రీనిధి రుణాల పంపిణీలో ఉత్తమ సమాఖ్యలుగా నిలిచిన ముప్కాల్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ మండల సమాఖ్యాల సిబ్బందికి అవార్డులను అందించారు.

అంకాపూర్‌ను సందర్శించిన భూపాలపల్లి జిల్లా ఎరువుల డీలర్లు



అంకాపూర్‌లో పొలాలను పరిశీలిస్తున్న భూపాలపల్లి జిల్లా విత్తన, ఎరువుల డీలర్లు

పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా విత్తన ఎరువుల డీలర్లు ఆదివారం సందర్శించారు. దేశీ కార్యక్రమంలో భాగంగా డీలర్లు గ్రామాన్ని సందర్శించారు. అంకాపూర్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ ఉప సర్పంచ్ మచ్చర్ల కిశోర్‌రెడ్డి, గురడి రెడ్డి కాపు సంఘం సభ్యుడు కేకే భాజన్నతో సమావేశమై గ్రామంలో పంటల సాగుకు ఎలాంటి విధానాలు అవలంభిస్తున్నారో తెలుసుకున్నారు. భూపాలపల్లి జిల్లా రిటైర్డు వ్యవసాయ శాఖ అధికారి నరేందర్ గౌడ్, దశరథ్ రెడ్డి, ఏఈవో శివాణి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ కట్ట నిర్మాణానికి శ్రీకారం

భూమి పూజ చేసిన స్పీకర్ పోచారం



భూమి పూజ చేస్తున్న స్పీకర్ పోచారం

వర్ని : వర్ని మండలం సిద్దాపూర్ అటవీ ప్రాంతంలో రూ. 120 కోట్లతో నిర్మాణం చేపడుతున్న రిజర్వాయర్ కట్ట పనులకు ఆదివారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు. దట్టమైన అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య నిర్మాణమవుతున్న రిజర్వాయర్ వల్ల బాన్సువాడ నియోజకవర్గ రైతులతో పాటు గాంధారి మండలం రైతులకు ప్రయోజనం చేకూరుతుందని స్పీకర్ వెల్లడించారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే 14వేల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. ప్రాజెక్ట్ పనులను తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని అధికారులు నిర్మాణ సమయంలో ప్రాజెక్ట్ వద్దనే ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, వర్ని జడ్పీటీసీ హరిదాసు , వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గోపాల్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గిరి ,నాయకులు వీర్రాజు, దశరథ్ దేవేందర్, గంగాధర్, భరత్ నాయక్ పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన అవసరం



సమావేశంలో పాల్గొన్న ఐఎంఏ సభ్యులు

నిజామాబాద్ సిటీ : ఆధునిక యుగంలో ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని, ఊపిరితిత్తుల వ్యాధులకు ఆధునిక సాంకేతిక వైద్యవిధానం అందుబాటులో ఉందని పల్మనాలజీ వైద్యులు పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, శ్రీ విష్ణు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో అస్తమా, సీవోపీడీ, ఊపిరితిత్తుల జబ్బులపై జాతీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన వైద్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఈ.రవీందర్ రెడ్డి, నిజామాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంచందర్, డాక్టర్ జలగం తిరుపతి రావ్, విష్ణు ఆస్పత్రి అధినేత, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్, ప్రముఖ వైద్యులు ఘట్టాని, కవితారెడ్డి, వెంకటరమణ, రమణేశ్వర్, శ్రీశైలం , కరుణాకర్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



భిక్కనూరులో సమావేశమైన 1978-79 బ్యాచ్ విద్యార్థులు

భిక్కనూరు: భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978–79లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. 45 ఏళ్ల తర్వాత ఒక చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని నిర్ణయించుకున్నారు.

క్రైం కార్నర్

కరెంట్ షాక్‌తో బెటాలియన్ హోంగార్డు మృతి




భాస్కర్ (ఫైల్)



భాస్కర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ ఎస్వీ సత్యశ్రీనివాసరావు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న కలకొట్ల భాస్కర్ (44) ఆదివారం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందినట్లు బెటాలియన్ అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భాస్కర్ బెటాలియన్ సమీపంలో భార్య కె.ప్రియాంక, ఇద్దరు కొడుకులతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి పక్కనే గల ప్రదేశంలో ప్రమాదవశాత్తు కరెంట్ వైర్లకు తగిలి షాక్‌కు గురై చనిపోయాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బెటాలియన్ అధికారులు, డిచ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. భాస్కర్ మృతదేహానికి కమాండెంట్ ఎస్వీ సత్యశ్రీనివాసరావు నివాళులర్పించారు. మృతుడి భార్యాపిల్లలను ఓదార్చారు. భాస్కర్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

చెట్టును ఢీకొన్న బైక్ : ఒకరి మృతి



గంగాధర్ మృతదేహం

వేల్పూర్: వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామానికి చెందిన అవునూరి గంగాధర్(59) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గంగాధర్ రామన్నపేట్ గ్రామానికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మరణించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. మృతుడి భార్య రాజుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బైక్ పైనుంచి పడి వృద్ధురాలు..

ధర్పల్లి(ఇందల్వాయి): బైక్ పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాలు.. మోపాల్ మండలం కొలాస్పూర్ తండాకు చెందిన పిప్లీ బాయ్ (75) తన అల్లుడు శంకర్‌తో కలిసి బైక్‌పై కూతురు ఇంటికి యాచారం గ్రామానికి శనివారం బయలుదేరింది. చంద్రాయన్‌పల్లి వద్ద బైక్ మీద నుంచి జారిపడడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



మల్లయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని చిన్నఆత్మకూర్ గ్రామానికి చెందిన కొంపల్లి మల్లయ్య(49) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లయ్య కొంతకాలంగా తాగుడుకు బానిసై తిరుగుతుండేవాడు. ఆరునెలలుగా ఆయనకు మతిస్థిమితం సరిగ్గా లేదని కుటుంబసభ్యులు తెలిపారు. మల్లయ్య శనివారం సాయంత్రం జలాల్‌పూర్ శివారులో గల పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. చీకటిపడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా వస్తున్నాని చెప్పి రాలేదు. కాగా ఆదివారం ఉదయం జలాల్‌పూర్ శివారులో గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్లయ్య ఆరోగ్య పరిస్థితి బాగాలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.